## క్లుప్తంగా

### ఎక్సైజ్ సీఐకి వినతి



**దోమకొండ:** మండల కేంద్రంలోని రెండు వైన్స్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధులు ఎక్సైజ్ సీఐ మధుసూదన్ రావుకు శనివారం ఫిర్యాదు చేశారు. జీపీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వైన్స్‌లు నడుపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే వైన్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధులు పున్న లక్ష్మణ్, నాగరాజ్‌రెడ్డి, గజవాడ శ్రీకాంత్, భూపాల్‌రెడ్డి, నేతల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

### ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



**సదాశివనగర్:** మండలంలోని మోడెగాం, భూంపల్లి గ్రామాల్లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యుడు మారుతి, నేత్ర వైద్య సహాయకుడు హరికిషన్ రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



**గాంధారి:** ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ మొండిసడక్ గ్రామస్తులు ఎంపీడీవో రాజేశ్వర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని సర్వాపూర్–మొండిసడక్ జీపీ పరిధిలో, మొండిసడక్ వద్ద గాంధారి–బాన్సువాడ ప్రధాన రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని జీపీ రికార్డుల్లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### నియామకం


గజ్జెల భిక్షపతి

**భిక్కనూరు:** ఆర్టీసీ న్యాయవాదిగా భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన గజ్జెల భిక్షపతి నియామకమయ్యారు. ఈ మేరకు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కామారెడ్డి జిల్లాలో ఆర్టీసీ తరఫున ఆయన కేసులను వాదించనున్నారు. ఈ సందర్భంగా భిక్షపతిని పలువురు న్యాయవాదులు, యువకులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

### పారిశుధ్య పనుల పరిశీలన



**బీబీపేట:** మండలంలోని రాంరెడ్డిపల్లిలో మండల ప్రత్యేకాధికారి సతీశ్‌యాదవ్ పారిశుధ్య పనులను శనివారం పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై పలువురికి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, ఎంపీవో కృష్ణ, కార్యదర్శి వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

### బోరుబావి తవ్వకం



**కామారెడ్డి రూరల్:** దేవునిపల్లిలోని 12వ వార్డు విద్యుత్‌నగర్ కాలనీలో శనివారం బోరుబావి తవ్వకం పనులను కౌన్సిలర్ కాసర్ల గోదావరి స్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో 35వ వార్డు కౌన్సిలర్ పోలీస్ క్రిష్టాజీరావు, కాసర్ల భాను, ద్యావరి నరేశ్, బాలస్వామి, రవి, రియాజ్, రాజేశ్వరరావు, ముదం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### బిచ్కుందలో ముస్లింల ర్యాలీ

**బిచ్కుంద:** ఉత్తర్‌ప్రదేశ్‌లో మహ్మద్ ప్రవక్తపై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేశారని వారిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ముస్లింలు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# మూగజీవాలకు అందని వైద్యం

- సిబ్బంది కొరత.. ఇబ్బందుల్లో రైతులు
- ఇన్‌చార్జి వైద్యుడితోనే కొనసాగింపు
- పూర్తిస్థాయి వైద్యుడిని నియమించాలని రైతుల డిమాండ్


పశువైద్యాధికారి లేక ఖాళీగా ఉన్న కుర్చీ


మూసి ఉన్న లింగంపేట పశు వైద్యశాల

**లింగంపేట:** మూగజీవాలకు వైద్య సేవలు కరువయ్యాయి. దీంతో పశుయజమానులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 41 గ్రామ పంచాయితీలు, 36 గ్రామాలు, 36 తండాలు ఉన్నాయి. 12 ఏళ్లుగా లింగంపేటలో దీర్ఘకాలం పని చేసిన రవికుమార్ జూలై 26న బదిలీపై వెళ్లారు. దీంతో ఈ పశు వైద్యశాలకు తాడ్వాయికి చెందిన పశు వైద్యాధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలతో అతను సక్రమంగా రావడం లేదని పశుపోషకులు పేర్కొంటున్నారు. దీంతో గత మూడు నెలలుగా పశువులకు వైద్యం అందక ఇబ్బందులు రైతులు ఎదుర్కొంటున్నారు. పలు పశువులు మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలానికి నాలుగు వైపులా 15 కిలో మీటర్ల దూరం గ్రామాలు ఉండడంతో పశు పోషకులు మండల కేంద్రానికి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో ఒకే పశు వైద్యశాల ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న వైద్యశాలలో సిబ్బంది కొరత ఉంది. ప్రస్తుతం వెటర్నరీ అసిస్టెంట్ ఒక్కరు మాత్రమే ఉన్నారు. అటెండర్‌తో పాటు మరికొంత మంది సిబ్బందిని నియమించాలి. మూడు నెలలుగా తాత్కాలిక వర్కర్‌తో పశువులకు వైద్యం చేస్తున్నారు. అతనికి అవగాహన లేకపోవడంతో గోపాలమిత్రలపైనే ఆధారపడాల్సి వస్తోందని వాపోతున్నారు. గోపాల మిత్రలు డబ్బులు ఇస్తేనే వైద్యం అందిస్తున్నారని పశువుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఆవులు 8580, గేదెలు 12376, గొర్లు 29467, మేకలు 14979 ఉన్నాయి. మండలంలో ఒకే పశువైద్యశాల ఉండడంతో 65402 మూగ జీవాలకు వైద్యం అందించడం లేదని విమర్శలు ఉన్నాయి. మండలంలో ఆరు వేలుకు పైగా కుటుంబాలు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నాయి. మండలంలో మరో పశువైద్యశాల ఏర్పాటు చేయాలని రైతులు, పశుపోషకులు కోరుతున్నారు.

**పశువులకు సోకుతున్న వ్యాధులు**

పశువులకు సాధారణంగా వర్షాకాలంలో గుండెవాపు, జబ్బవాపు, మూతిరోగం, వ్యాధులు వస్తుంటాయి. గాలికుంటు వ్యాధి సోకి పశువులు నడవలేకపోతాయి. అలాగే మేకలకు, గొర్లకు దొబ్బరోగం, ఈటి(పారుడు వ్యాధి), అమ్మతల్లి, తదితర వ్యాధులు సోకుతుంటాయి. వీటికి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ముందు జాగ్రత్తగా టీకాలు ఇవ్వాలి. కొంత కాలంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాధులు సోకడం వల్ల పాల దిగుబడి తక్కువగా వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి పశువైద్యాధికారితో పాటు సిబ్బందిని పెంచాలని కోరుతున్నారు.

# ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు


శివానగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు


సిద్దాపూర్‌లో..

**ఎల్లారెడ్డిరూరల్:** రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని శివానగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మారెడ్డి రజిత, సొసైటీ చైర్మన్ నర్సింలు, మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**భిక్కనూర్‌లో..**

ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నర్సింలు, కార్యదర్శి విశ్వనాథం పాల్గొన్నారు.

**సిద్దాపూర్‌లో..**

**రాజంపేట:** మండలంలోని ఆర్గొండ సొసైటీ పరిధిలో గుండారం, సిద్దాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్గొండ సింగిల్ విండో చైర్మన్ కందిశి వరాములు ప్రారంభించారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి మనియొద్దీన్, సీఈవో సాయిలు, రైతులు పాల్గొన్నారు.

**జక్కల్‌దాని తండాలో..**

**బాన్సువాడ రూరల్:** మండలంలోని జక్కల్‌దాని తండాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బొర్లం సహకార సంఘం చైర్మన్ సంగ్రామ్ నాయక్ మాజీ ఏఎంసీ చైర్మన్ నర్సింహులుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సురేందర్‌రావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మన్నె చిన్నసాయిలు, సంగ్యానాయక్, బస్సీనాయక్, జగ్రామ్, నర్సింగ్, బోడ చందర్ తదితరులు పాల్గొన్నారు.

**వెల్గనూర్‌లో..**

**నిజాంసాగర్:** మండలంలోని వెల్గనూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అచ్చంపేట సొసైటీ చైర్మన్ కయ్యం నర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు రమేశ్ గౌడ్, నాయకులు రామలింగం, సంపత్‌రెడ్డి, సొసైటీ సీఈవో సంఘమేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


నిజాంసాగర్‌లో చెక్కు అందజేస్తున్న మల్లికార్జున్


మాచాపూర్‌లో చెక్కులను అందిస్తున్న నాయకులు

**నిజాంసాగర్:** సీఎంఆర్‌ఎఫ్ బాధితులకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఇద్దరు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురై మెరుగైన వైద్యం చేయించుకోలేని వారికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నాయకులు అనిస్, సత్యాగౌడ్, రాములురాథోడ్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**మాచాపూర్‌లో..**

**ఎల్లారెడ్డి:** మండలంలోని మాచాపూర్‌లో బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు శనివారం అందజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



**నస్రుల్లాబాద్:** రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు సీఐ రాజేశ్ తెలిపారు. మండల కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందడంతో ఘటనా స్థలాన్ని శనివారం పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించి మూల మలుపు వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఆయన వెంట తహసీల్దార్ బావయ్య, ఏఎస్సై వెంకట్రావు, మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, నాయకులు ప్రతాప్‌సింగ్, రమేశ్ గౌడ్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

## సన్మానాలు

**టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం**



**పిట్లం:** టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను పార్టీ జుక్కల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరవింద్ హైదరాబాద్‌లో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

**ఎమ్మెల్యేకు..**



**ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు లక్ష్మీనారాయణ, గాంధీ శనివారం సన్మానించారు. ఇటీవల డిగ్రీ కళాశాల, మోడల్ స్కూల్‌లో సిబ్బంది బదిలీపై రావడంతో వారు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రకాంత్, గంగారెడ్డి, సిద్దురాజ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులకు..**

**కామారెడ్డి టౌన్:** ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా విధుల్లో చేరిన బయోసైన్స్ ఉపాధ్యాయులను బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ దేవునిపల్లిలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, సదాశివుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### చిన్నారులకు వైద్య పరీక్షలు

**నిజాంసాగర్:** అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, టీచర్లు శ్రద్ధ చూపాలని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రోహిత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, సాయవ్వ, విజయ తదితరులు పాల్గొన్నారు.

## సమాచారం..

**28న మందకృష్ణ మాదిగ రాక**

**కామారెడ్డి రూరల్:** జిల్లా కేంద్రంలో ఈ నెల 28న నిర్వహించనున్న జిల్లా మహాసభలకు ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు పార్టీ జిల్లా ఇన్‌చార్జి మైలారం బాలు అన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సభలను పార్టీ నాయకులు విజయవంతం చే యాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్తిగారి లక్ష్మి, బట్ట వెంకట్ రాములు, పద్మారావు, కో టోళ్ల యాదగిరి, బట్ట రమేశ్, పురుషోత్తం, కొంగల భూమేశ్ లావణ్య, ప్రభాకర్, దేవేందర్ పాల్గొన్నారు.

**నేడు దయాబెటిస్ పరీక్షలు**

**సదాశివనగర్:** మండల కేంద్రంలోని శ్రీవాణి విద్యాలయంలో ఆదివారం మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిస్, షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి తెలిపారు. అలాగే క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**నేడు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మహా ధర్నా**

**తాడ్వాయి:** మండల కేంద్రంలో రైతుల సమస్యలపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుభరోసాపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. ధర్నాను రైతులు విజయవంతం చేయాలని కోరారు.

# వందశాతం ఉత్తీర్ణతకు కృషి


బాన్సువాడ సమావేశంలో అధికారులు

**బాన్సువాడ రూరల్:** ఇంటర్‌లో వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలామ్ అన్నారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కళాశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, అందుతున్న నాణ్యమైన విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలపై తల్లిదండ్రుల సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివకుమార్, సీసీడీ సభ్యులు దాసరి శ్రీనివాస్, అధ్యాపకులు జలీల్, స్వరూప్, యాదాగౌడ్, హఫీజ్, ఇక్బాల్, మక్బూల్, నరేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు**

**తాడ్వాయి:** ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో బోధన జరుగుతోందని మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యూసుఫ్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. రాబోయే వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మంచిర్యాంకులు సాధించాలన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**పిల్లల చదువులపై దృష్టి సారించాలి**

**నిజాంసాగర్:** పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్‌రాజ్ అన్నారు. శనివారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పాఠశాల నుంచి పిల్లలకు ఇళ్లకు వచ్చిన తర్వాత చదవడం, రాయడం నేర్పించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం

**బాన్సువాడ రూరల్:** పండరిపూర్ స్వాముల పాదయాత్ర షెడ్యూల్ వాల్ పోస్టర్లను శనివారం బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. బాన్సువాడ నుంచి వార్కరి స్వాములు కాలినడకన పండరిపూర్‌కు బయలుదేరుతారన్నారు. కార్యక్రమంలో రాములు మహరాజ్, నాందేవ్, కబీర్, నర్సింలు, పర్వంరెడ్డి, శ్రావణ్, నాయకులు జలీల్, సులేమాన్, గోపన్‌పల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం

**రామాలయ నిర్మాణం అభినందనీయం**



**గాంధారి:** మేడిపల్లి గ్రామస్తులు భక్తిభావంతో కోదండ రాయాలయం నిర్మించడం అభినందనీయమని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శనివారం నిర్వహించిన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దంపతులు హాజరై గోమాతకు పూజలు చేశారు. అనంతరం విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

**ఆలయంలో ప్రత్యేక పూజలు**

**తాడ్వాయి:** మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారి నందు, భక్తులు శివుడు, సిద్ధిరాంరెడ్డి, రాంచందర్‌రావు, బాపురావు, గంగారాం, రాజుగౌడ్ అంజన్న తదితరులు పాల్గొన్నారు.

**రామారెడ్డిలో అన్నదానం**

**రామారెడ్డి:** మండల కేంద్రంలోని రామారెడ్డి యూత్ దుర్గామాత ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

**పెద్దదేవిసింగ్ తండాలో బండారా**

**పెద్దకొడప్‌గల్:** మండలంలోని పెద్ద దేవిసింగ్ తండాలో శనివారం బాగ్‌చంద్ బాబా సంగత్(బండారా) మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా బండారా నిర్వహించినట్లు తండావాసులు తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు, తండావాసులు పాల్గొన్నారు.

**భక్తి మార్గంలో నడవాలి**

**పెద్దకొడప్‌గల్:** ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని బాలు మహరాజ్ సూచించారు. శనివారం విఠల్‌వాడి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో అఖండ హరినామ సప్తాహం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**99 రోజుల పాటు భజన కార్యక్రమాలు**

**కామారెడ్డి అర్బన్:** భగవాన్ శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా 99 రోజుల నగర సంకీర్తన భజన కార్యక్రమాలు శనివారం ప్రారంభమైనట్లు కామారెడ్డి అయ్యప్పనగర్ సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు. శనివారం నగరసంకీర్తన, నారాయణ సేవా అన్నదానం, సాయంత్రం స్వామి పాదాల తండులార్చన, భజనలు నిర్వహించారు. సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ ఆడిట్‌కు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో నరేశ్

**లింగంపేట:** మండలంలోని 41 జీపీల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై త్వరలో ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నరేశ్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉపాధి హామీ సిబ్బంది, జీపీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో జరగబోయే ఆడిట్‌కు సంబంధిత రికార్డులు సిద్ధం చేసుకోవాలని క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులకు సూచించారు. గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు, వాటికి సంబంధించిన మస్టర్లు, రికార్డులు సిద్ధం చేసి ఎంపీడీవో కార్యాలయంలో అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మలహరి, ఎఫ్‌ఏలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఈకి వ్యాపారుల వినతి

**నిజాంసాగర్:** ఎన్‌హెచ్ 765–డి రహదారి విస్తరణ పనుల్లో దుకాణ సముదాయాలు కోల్పోతున్న వ్యాపారులు శనివారం సిద్దిపేటలో హైవే అథారిటీ ఎస్ఈ బలరామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. మహమ్మద్ నగర్ మండలం కేంద్రంలో ఎన్‌హెచ్ 765–డి రహదారి విస్తరణకు పూర్తిగా సహకరిస్తామని, దుకాణ సముదాయాల ముందర డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, నాల్గు ఫీట్లు తగ్గించాలని కోరారు. ఎస్ఈని కలిసిన వారిలో దుబ్బ వసంత్‌కుమార్, విక్రమ్, దర్జి శ్రీధర్, కాశీనాథ్, ప్రేమాజీ, రఫీయొద్దీన్, శేఖర్, సతీశ్‌గౌడ్, రాజాగౌడ్, పద్మారావు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## సంక్షిప్తం

**నిర్మాణంలో ఉన్న సబ్‌సెంటర్ల పరిశీలన**

**భిక్కనూరు:** మండల కేంద్రంతో పాటు రామేశ్వర్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న సబ్‌సెంటర్లను భిక్కనూరు వైద్యురాలు దివ్య శనివారం పరిశీలించారు. పనులు వెంటనే పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆమె వెంట ఎంపీహెచ్ఈవో వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

**దేశాయిపేట్‌లో మద్యం అమ్మకాలపై నిషేధం**

**బాన్సువాడ రూరల్:** మండలంలోని దేశాయిపేట్‌లో మద్యం అమ్మకాలపై నిషేధం విధిస్తూ గ్రామస్తులు శనివారం తీర్మానం చేశారు. మాజీ ఎంపీపీ భూనేకర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, యువకులు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామస్తులు తీసుకున్న నిర్ణయంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా గ్రామంలో మద్యం అమ్మకాలకు చేపడితే రూ.50వేల జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో పట్కారి విఠల్, సామాగౌడ్, గాండ్ల రమణ, పోచయ్య, గాండ్ల సాయిలు, బాబురావు, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలి**

**రాజంపేట:** ఇందిరమ్మ కమిటీలో పార్టీలకతీతంగా గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రతినిధులతో ఇందిరమ్మ కమిటీని ఏర్పాటు చేయాలని రాజంపేట సింగిల్ విండో వైస్ చైర్మన్ అంద్యాల రమేశ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరు చెప్పి నేడు కమిటీల పేరుతో రాజకీయం చేస్తోందని ఆరోపించారు. మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి గ్రామస్తుల నిర్ణయం మేరకు కమిటీకి సంబంధించిన ప్రతినిధులను ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు.

**మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి**

**భిక్కనూరు:** మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మహిళా సాధికారత జిల్లా కన్వీనర్ శిరీష అన్నారు. మండలంలోని కాచాపూర్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా చట్టాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రభుత్వాలు మహిళల హక్కుల పరిరక్షణకు ఎంతగానో కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సిబ్బంది శారద, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిక**



**నాగిరెడ్డిపేట:** బీజేపీ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు గంపల వెంకన్న శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాంచందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, మురళీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**పాఠశాలకు ప్రొజెక్టర్ వితరణ**

**రాజంపేట:** తలమడ్ల ప్రాథమిక పాఠశాలకు శ్రీ విశ్వనాథ గంగాభవాని ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 40వేలు విలువ చేసే ప్రొజెక్టర్‌ను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ మామిళ్ల గోపాల్, హెచ్‌ఎం రమేశ్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, సొసైటీ డైరెక్టర్ శివకుమార్, ట్రస్ట్ సభ్యులు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గడ్డం గంగారాం, సామ్ రెడ్డి, సంపత్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.